క్లుప్తంగా

పండ్ల తోటల పెంపకంపై దృష్టి సారించాలి

మాచర్ల: పల్నాడు ప్రాంతంలో నీటి కొరత కారణంగా ఖరీఫ్‌లో రైతులు పండ్ల తోటల పెంపకంపై దృష్టి సారించాలని హార్టీకల్చర్ మండల అధికారి వై.మోహన్‌రావు సూచించారు. వ్యవసాయ శాఖ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో రైతులకు సాగు విధానాలపై అవగాహన కల్పించారు. పండ్ల తోటల పెంపకం, డ్రిప్ ఇరిగేషన్‌తో ఉపయోగాలు, తక్కువ పెట్టుబడితో పంటల సాగు విధానం గురించి వివరించారు. పండ్ల తోటల పెంపకంతో తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం సంపాదించవచ్చని, ఈ దిశగా రైతులకు అవగాహన కల్పించడంలో హార్టీకల్చర్ సిబ్బంది కృషి చేస్తున్నారని తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో ప్రతి గ్రామంలో పర్యటించి రైతులను చైతన్యవంతులను చేయాలని ఆయన సిబ్బందికి చెప్పారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

అదనపు కట్నం వేధింపులు : ముగ్గురిపై కేసు

నాదెండ్ల: అదనపు కట్నం తీసుకురావాలని అత్తింటివారు వేధిస్తున్నారంటూ వివాహిత ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ జి.పుల్లారావు తెలిపిన వివరాల మేరకు .. కనపర్రు గ్రామానికి చెందిన షేక్ మనీషాకు ఐదేళ్ల క్రితం మహబూబ్ బాషాతో వివాహమైంది. వీరికి కుమారుడు ఉన్నారు. కొంతకాలంగా అదనపు కట్నం తేవాలంటూ వేధిస్తున్నారంటూ భర్త మహబూబ్ బాషా, అత్త, మరొకరిపై మనీషా ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వైద్యం వికటించి బాలిక మృతి



యడ్లపాడు: వైద్య వికటించి బాలిక మృతి చెందిందంటూ జగ్గాపురం వాసులు ఓ మెడికల్ షాపు వద్ద ఆందోళన చేసిన ఘటన గురువారం రాత్రి కలకలం రేపింది. సేకరించిన వివరాల ప్రకారం.. ఈ నెల 17వ తేదీన జగ్గాపురం గ్రామానికి చెందిన బొంతు కోటేశ్వరరావు కుమార్తె శాలిని (9) అనారోగ్యంతో ఉన్నందున యడ్లపాడు గ్రామంలోని ఓ మెడికల్ షాపులో వైద్యం చేయించారు. దీంతో బాలిక అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో మృతి చెందింది. దీంతో బాలిక కుటుంబ సభ్యులు యడ్లపాడులో వైద్యం చేయించిన షాపు వద్ద మృతదేహాన్ని ఉంచి ఆందోళన చేశారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్ఐ టి.శివరామకృష్ణను వివరణ కోరగా జగ్గాపురానికి చెందిన కోటేశ్వరరావు భార్య ఫిర్యాదు చేయగా అనుమానాస్పద కేసుగా నమోదు చేశామన్నారు. అయితే బాలిక మృతికి సంబంధించిన పూర్తి వివరాలు దర్యాప్తులో వెలుగు చూడాల్సి ఉందని చెప్పారు.

చెల్లని చెక్కు కేసులో జైలు, జరిమానా

నరసరావుపేటటౌన్: చెల్లని చెక్కు కేసులో నేరం రుజువు అవడంతో నిందితుడు బాపట్లకు చెందిన కంభంపాటి వెంకట రామ గోపాలశర్మకు ఏడాది జైలు, రెండు లక్షల రూపాయలు ఫిర్యాదుదారుడికి చెల్లించేలా, రూ. 5000 రూపాయలు జరిమానా విధిస్తూ స్థానిక మొదటి అదనపు జూనియర్ సివిల్ న్యాయమూర్తి ఎ. సలోమి గురువారం తీర్పు వెలువరించారు. నిందితుడు శర్మ 2015 మార్చి 5న ముప్పాళ్ల మండలం గోల్లపాడు గ్రామానికి చెందిన గోపు కోటేశ్వరరావు వద్ద రూ.2 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. చెల్లింపులో భాగంగా 2018 అక్టోబర్ 12న రెండు లక్షలకు చెక్కు ఇచ్చాడు. కోటేశ్వరరావు చెక్కును తన బ్యాంక్ ఖాతాలో వసూలుకు వేసుకోగా అది చెల్లలేదు. ఈ మేరకు ఆయన కోర్టులో కేసు దాఖలు చేయగా. విచారణలో నేరం రుజువు అవడంతో పై విధంగా తీర్పు చెప్పారు.

పేద బ్రాహ్మణులకు నిత్యావసర సరకులు పంపిణీ

వినుకొండ: ఆర్థికంగా వెనుకబడిన పేద బ్రాహణులకు చేయూత అందించడం బాధ్యతగా భావించాలని బ్రాహ్మణ పెద్దలు మంత్రిరాజు సత్యనారాయణ అన్నారు. బ్రాహ్మణ సేవాసంఘం ఆధ్వర్యంలో పేద బ్రాహ్మణులకు గురువారం భాగవతుల రవికుమార్ అనురాధల ఆధ్వర్యంలో సరకులు అందజేశారు. దాతలను పి.వి.సురేష్ బాబు, గాలి శ్రీనివాసరావులు అభినందించారు. కార్యక్రమంలో జనార్దనాచార్యులు, అన్నాప్రగడ వెంకటేశ్వరరావు, చింతలచెర్వు రఘు, బుచ్చిరాజు పాల్గొన్నారు.

శావల్యాపురంలో వారాహీ నవరాత్రి పూజలు ఆరంభం

శావల్యాపురం: మండల కేంద్రంలో వేంచేసియున్న శ్రీ కనకదుర్గ అమ్మవారి దేవాలయంలో శ్రీ వారాహీ మాతా నవరాత్రి వేడుకలు శుక్రవారం నుంచి ప్రారంభమైనట్లు ఆలయ కమిటీ చైర్మన్ రెడ్డి జ్వాల నరసింహా రావు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వారాహీ నవరాత్రి వేడుకలు వచ్చేనెల 4 వరకు జరుగుతాయన్నారు. ఆలయ పూజారి రావిపాటి సాయి భరత్ సారథ్యంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరణ చేసి పూలమాలల వేసి మహిళా భక్తులచే కుంకుమాభిషేకం, అభిషేకాలు అర్చనలు విశేష పూజలు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కిరణ్ కుమార్, కొర్నెపల్లి సాంబశివరావు గ్రామస్తులు పాల్గొన్నారు.

డ్రగ్స్ వద్దు.. జీవితం ముద్దు



అవగాహన ర్యాలీలో అధికారులు, విద్యార్థులు

మాచర్ల: మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి.. డ్రగ్స్ వద్దు.. జీవితం ముద్దు అంటూ గురువారం పట్టణంలో ఎక్సైజ్, మున్సిపల్, పోలీసు, విద్యా శాఖల ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ వెంకటరమణ మాట్లాడుతూ మత్తు పదార్థాల బారిన యువత పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. తల్లిదండ్రులు కూడా పిల్లల నడవడికపై జాగ్రత్తలు వహించాలని చెప్పారు. అర్బన్ సీఐ ఎం.ప్రభాకరరావు మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని తెలిపారు. మున్సిపల్ కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ కొనసాగించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ మదార్ సాహెబ్, కమిషనర్ డి.వేణుబాబు, తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఎంపీడీఓ నాయక్, ఎంఈఓ అల్లి సురేష్, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మత్తుతో జీవితాలు చిత్తు

పిడుగురాళ్ల: మాదక ద్రవ్యాల మహమ్మారి నుంచి విద్యార్థులు , యువత, ప్రజలు దూరంగా ఉండాలని తహసీల్దార్ మధుబాబు తెలిపారు. పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో ప్రపంచ మాదక ద్రవ్యాల నిర్మూలన దినోత్సవం పురస్కరించుకొని గురువారం ర్యాలీ, మానవహారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మత్తుతో జీవితాలు చిత్తు చేసుకోవద్దని తెలిపారు. నేటి సమాజంలో ఎక్కువగా యువత డ్రగ్స్‌కి అలవాటు పడి, ప్రేమ ఆప్యాయతలకు దూరమైపోతున్నారని పేర్కొన్నారు. తల్లిదండ్రులపైనే దాడులు చేసి చంపేసే పరిస్థితులు నెలకొన్న సందర్భాలు నిత్యం చూస్తూనే ఉన్నామని ఆందోళన వ్యక్తం చేశారు. పట్టణ ఎస్ఐలు శివ నాగరాజు, మోహన్ మాట్లాడుతూ పట్టణంలో మాదక ద్రవ్యాల వాడకం నిర్మూలించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. అనంతరం పట్టణ పోలీస్ స్టేషన్ నుంచి హైలాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పోలీస్ స్టేషన్ వద్ద మానవ హారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రెవెన్యూ, పోలీస్ అధికారులు, విద్యార్థులు, యువకులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌తో యువత పెడదారి

వెల్దుర్తి: యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని ఎంపీడీఓ డి. ప్రసాద్ సూచించారు. వెల్దుర్తిలో గురువారం డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ స్కూల్స్, కాలేజీల ప్రాంగణాలలో డ్రగ్స్, గంజాయి దొరికితే కఠిన చర్యలు తీసుకుంటారని తెలిపారు. విద్యా సంస్థల సమీపంలో, దుకాణాల్లో గంజాయి చాక్లెట్లు అమ్ముతున్నారని, ఆ సమాచారాన్ని పోలీసులకు అందించాలని కోరారు. డ్రగ్స్‌తో యువత పక్కదారి పట్టి జీవితాలను నాశనం చేసుకుంటోందని తెలిపారు. రాష్ట్రాన్ని డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ సమందర్‌వలి, ఈఓపీఆర్డీ మకట్‌లాల్, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి

రెంటచింతల: మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని ఎంపీడీఓ కె. సరోజినీదేవి సూచించారు. మాదక ద్రవ్యాలపై ప్రజల్లో చైతన్యం కల్పించడంలో భాగంగా రెంటచింతలలో గురువారం అధికారులు, విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడటం వల్ల జీవితాలు నాశనంతో పాటు సమాజానికి తీవ్ర నష్టం కలుగుతుందని తెలిపారు. తహసీల్దార్ దొప్పలపూడి మేరి కనకం మాట్లాడుతూ మద్యం, డ్రగ్స్ మత్తులో కొందరు తీవ్రమైన నేరాలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యపానం, మాదకద్రవ్యాలు నేటి యువతను పీడిస్తున్నాయని తెలిపారు. యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడి వారి బంగారు భవిష్యత్‌ను కోల్పోతున్నారని పేర్కొన్నారు. అనంతరం గుంటూరు- మాచర్ల ప్రధాన రహదారిపై మానవ హారంగా ఏర్పడి, విద్యార్థులతో మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటాం అంటూ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 వై. శివనాగేశ్వరరావు, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, మాజీ వైస్ ఎంపీపీ గొంటు సుమంత్‌రెడ్డి, పీహెచ్‌సీ మాజీ చైర్మన్ బొడపాటి రామకృష్ణ, టీడీపీ మండల అధ్యక్షులు సీహెచ్ అబ్బిరెడ్డి, మున్నా ప్రభురాజు, ఓరుగంటి ఇన్నారెడ్డి అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌తో జీవితాలు నాశనం

గురజాల : యువత చెడు వ్యసనాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని సీఐ ఆవుల భాస్కర్‌రావు తెలిపారు. పల్నాడు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు డ్రగ్స్ వాడకంపై గురువారం పట్టణంలో పోలీసులు స్టేషన్ నుంచి శ్రీరాంపురం మీదుగా బ్రహ్మనాయుడు విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుపై శ్రద్ధ ఉంచి ఉన్నతస్థాయికి ఎదగాలని తెలిపారు. చెడు వ్యసనాలకు పలువురు బానిసలై జీవితాలు నాశనం చేసుకుంటున్నారని, డ్రగ్స్‌కు దూరంగా ఉండి మంచి భవిష్యత్తుకు మరల్చుకోవాలని సూచించారు. మత్తు పదార్థాలను వాడటం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. అనంతరం మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో ఎస్ఐలు వినోద్‌కుమార్, బి. అనంతకృష్ణ పాల్గొన్నారు.

- నగర పంచాయతి కమిషనర్ వై. శ్రీమన్నారాయణ ఆధ్వర్యంలో సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. టీడీపీ పట్టణ కన్వీనర్ అడపా శ్రీనివాసరావు, శరమాళ్ల హనుమంతరావు పాల్గొన్నారు.

డ్రగ్స్ వినియోగం, రవాణా నేరం

గురజాల : మాదక ద్రవ్యాలు వినియోగించడం, అక్రమ రవాణా చేయడం నేరమని సీనియర్ సివిల్ సివిల్ జడ్జి వై. శ్రీనివాసరావు తెలిపారు. మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, నాలుగో అదనపు జిల్లా జడ్జి ఆర్. శరత్‌బాబు ఆదేశాల మేరకు జయభారత్ జూనియర్ కళాశాలలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి మాట్లాడుతూ విద్యార్థి దశలో చెడు అలవాట్లకు లోనుకావడం వల్ల కుటుంబం మొత్తం ఛిన్నాభిన్నమవుతుందని తెలిపారు. మత్తు పదార్థాల అలవాటును వెంటనే మానుకోవాలని సూచించారు.



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వై. శ్రీనివాసరావు

కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి కె.వి.వి. సత్యనారాయణ, న్యాయవాదులు కోట శ్రీనివాసరావు, షేక్ జానీ బాషా, వైద్యులు పాల్గొన్నారు.

యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి



సదస్సులో మాట్లాడుతున్న జడ్జి ప్రవళిక

పిడుగురాళ్ల: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉన్నప్పుడే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు ఎదుగుతారని పిడుగురాళ్ల జూనియర్ సివిల్ కోర్ట్ న్యాయమూర్తి టి. ప్రవళిక సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం పిడుగురాళ్ల మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో పిడుగురాళ్ల బార్ అసోసియేషన్ సహకారంతో మాదక ద్రవ్యాల నిర్మూలనపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. న్యాయమూర్తి ప్రవళిక మాట్లాడుతూ విద్యార్థులు చక్కని ప్రణాళికతో విజయాలను సాధించాలని సూచించారు. సమయాన్ని వృథా చేయకుండా, లక్ష్య సాధన కోసం కృషి చేసి భావి భారత పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ప్యానల్ న్యాయవాది రమేష్ మాట్లాడుతూ విద్యార్థులు తల్లిదండ్రుల కష్టాలను ఎప్పుడూ గుర్తు చేసుకుంటూ ఉంటే చెడు వ్యసనాలకు బానిసలు కారని తెలిపారు. చక్కగా చదువుకుని ఉన్నత శిఖరాలకు ఎదుగుతారని సూచించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఈశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ నేటి విద్యార్థులే రేపటి భవితకు పునాదులని, ఎప్పుడూ ఉన్నత చదువులపై దృష్టి సారించాలని చెప్పారు. న్యాయవాదులు జి. రమేష్, ఎస్.వి.కోటేశ్వరరావు, ఆయాజ్ అహ్మద్, ఎస్ఐ శివ నాగరాజు, పారా లీగల్ వలంటీర్ పి.నవ్య, కాలేజీ లెక్చరర్లు, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



రెంటచింతలలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, అధికారులు



గురజాలలో పోలీసుల ర్యాలీ



వెల్దుర్తి బస్టాండ్ సమీపంలో మానవహారం



పిడుగురాళ్లలో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, విద్యార్థులు

దాతల సహకారంతో శరవేగంగా అభివృద్ధి



దాచేపల్లి: దాతల సహకారంతో గ్రామం, పాఠశాలల్లో అభివృద్ధి పనులు శరవేగంగా జరిగాయని సర్పంచ్ నెమలికంటి వెంకటాచారి అన్నారు. మండలంలోని ముత్యాలపాడు గ్రామం, పాఠశాల అభివృద్ధికి పిట్టల జానకీరామిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్, ముత్యాలంపాడు ఆర్జిన్స్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు పిట్టల గోపిరెడ్డి, పిట్టల పరమేశ్వర్‌రెడ్డి, పిట్టల కృష్ణమోహన్ రెడ్డిలు నిధులు కేటాయించారు. గ్రామానికి, పాఠశాలలకు వారు చేసిన సేవలను గుర్తించి దాతలను గురువారం ఘనంగా సన్మానించి, అభినందించారు. పాఠశాలలకు ఉచిత మంచినీటి సరఫరా, పదో తరగతి ఫలితాలలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతి, హైస్కూల్ గ్రౌండ్ లెవెలింగ్ కోసం రూ. 1.50 లక్షలు, గ్రామంలోని ఆలయ నిర్మాణం, పునరుద్ధరణ కార్యక్రమాల కోసం రూ.30లక్షలను విరాళంగా అందించారు. గ్రామం, పాఠశాలల అభివృద్ధి కోసం తమవంతు సహకారం అందిస్తామని దాతలు చెప్పారు. కార్యక్రమంలో విశ్రాంత ప్రిన్సిపాల్ పాశం కృష్ణారెడ్డి, ముత్యాలంపాడు ఆర్జిన్స్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ యరవెద గురవారెడ్డి, గ్రామ పెద్దలు సైదారెడ్డి, సీతారెడ్డి, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు రావినూతల వెంకట సుబ్బారావు, ఎంపీపీఎస్ ప్రధానోపాధ్యాయురాలు బళ్లా మేరి శ్యాం కుమారి, ఉపాధ్యాయులు గుడిబండి శ్రీనివాసరెడ్డి, లంకె వాసుదేవరావు పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థినికి ఉచితంగా సీటు



మాచర్ల: పట్టణంలోని పల్నాడు జూనియర్ కళాశాల విద్యార్థిని ఉప్పతోళ్ల లలిత ఇంటర్మీడియట్‌లో 959 మార్కులు సాధించిన సందర్భంగా న్యూటన్ ఇంజినీరింగ్ కళాశాల అధినేత శ్రీనివాసరెడ్డి అభినందించారు. విద్యార్థిని సాధించిన మెరిట్ ప్రశంసనీయమని పేర్కొన్నారు. పట్టణంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థిని లలితను ఘనంగా సత్కరించారు. తమ కళాశాలలో సీఈఎస్‌సీ బ్రాంచ్ సీటుతోపాటు, ఉచితంగా అడ్మిషన్ అవకాశాన్ని కల్పించారు. వెనుకబడిన పల్నాడు ప్రాంతంలో ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులకు తమ కళాశాల తరపున సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. విద్యను ప్రోత్సహించడమే తమ సంస్థ ధ్యేయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి

నరసరావుపేట రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.చంద్రకళ తెలిపారు. విద్యార్థుల నమోదు కార్యక్రమంలో భాగంగా మండలంలోని పాలపాడు ఎంపీపీఎస్ పాఠశాలను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల ఉపాధ్యాయులతో సమావేశమై విద్యార్థుల సంఖ్యపై సమీక్షించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను 60కు పైగా పెంచేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థులతో మాట్లాడి వారి మేథోశక్తిని పరీక్షించారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ తీరుపై విద్యార్థులను ప్రశ్నించారు. రుచికరమైన, నాణ్యమైన భోజనాన్ని అందించాలని సూచించారు. విద్యార్థులకు ఉత్తమ విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలని తెలిపారు. యోగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌కు సంసిద్ధంగా ఉండాలని తెలిపారు. పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సంయుక్త భాగస్వామ్యంతో జరిగే ఈ సమావేశంలో విద్యాపరమైన అంశాలు, పిల్లల అభివృద్ధి, పాఠశాల ఆవరణ అభివృద్ధి వంటి అంశాలపై సమీక్షించాలని తెలిపారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో చంద్రకళ

మైనింగ్ సమస్యలపై ఆర్డీవో క్షేత్రస్థాయి విచారణ

యడ్లపాడు: మైనింగ్ క్వారీయింగ్ వల్ల తమ గ్రామంలో పలు సమస్యలు నెలకొన్నాయంటూ జిల్లా గ్రీవెన్స్‌లో పెట్టుకున్న ఫిర్యాదు మేరకు ఆర్డీవో మధులత క్షేత్రస్థాయి విచారణకు వచ్చారు. గురువారం యడ్లపాడు మండలం ఉప్పరపాలెం గ్రామస్తులు, మైనింగ్, పంచాయతీశాఖ అధికారులతో కలిసి చర్చించారు. గ్రామం పరిధిలోని కొండ క్వారీల్లో విస్తృతంగా జరిగే మైనింగ్ బ్లాస్టింగ్ వలన నివాసాలు బీటలు వారుతున్నాయని, అలాగే ఇక్కడి ప్రజలు పలు అనారోగ్య సమస్యల్ని ఎదుర్కొంటున్నట్లు అధికారులకు సమర్పించి ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఆర్డీవో తెలిపారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణకు వచ్చినట్లు వెల్లడించారు. మైనింగ్ లీజుదారులు ఎంతమంది ఉన్నారు.. వారికి ఏ ప్రాతిపదికన లీజు మంజూరు చేశారు.. హద్దులు, కాల పరిమితి వంటి అన్ని అంశాలను వివరించాలని సమగ్ర వివరాలను తనకు అందించాలని మైనింగ్‌శాఖ అధికారులను కోరారు. అలాగే పంచాయతీ తీర్మానాలు ఏవైనా చేశారా ? అనే వివరాలను సేకరించాలని తహసీల్దార్ జెట్టి విజయశ్రీను ఆదేశించారు. ప్రస్తుత మైనింగ్ ప్రాంత పరిస్థితి, ఎవరు క్వారీయింగ్ చేస్తున్నారు, ఏ మేరకు చేశారు తదితర అంశాలపై మండల తహసీల్దార్, సర్వేయర్లు సమన్వయంగా సర్వే చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వి.హేమలతాదేవి, సర్వేయరు గేరా సురేంద్ర నాథ్, ఆర్ఐ సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శి, లీజుదారులు, గ్రామస్తులు పాల్గొన్నారు. పాల్గొన్నారు.



ఉప్పరపాలెంలో వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఆర్డీవో మధులత

మాలలకు కూటమి తీవ్ర అన్యాయం

వినుకొండ: రాష్ట్రంలో మాలలకు కూటమి పాలకులు తీవ్ర అన్యాయం చేశారని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు గోదాజాన్‌పాల్ ఆరోపించారు. స్థానిక సీపీఎం భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాలం చెల్లిన వర్గీకరణ సుప్రీం కోర్టులో కేసు కొట్టివేసిన అంశాన్ని తిరిగి మరలా కూటమి ప్రభుత్వం ఆర్డినెన్స్ పేరిట మాలలకు అన్యాయం చేసే విధంగా కుట్ర నడిచిందని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా మాల ఉద్యోగులపై మానసిక దాడులు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత డీఎస్సీ నిర్వహిస్తామని చెప్పి ఎస్సీ వర్గీకరణ పేరుతో ఏడాది కాలం వాయిదా వేసిందని విమర్శించారు. గ్రామాల్లో నేటికీ మాలపల్లెల్లో శ్మశానవాటికలు లేవని, మాలలకు న్యాయం జరుగని పక్షంలో ఉద్యమం చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షులు కీర్తిపాటి వెంకటేశ్వర్లు, పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు కొండ్రు విజయ్, వర్కింగ్ ప్రెసిడెంట్ గడిపూడి ఏసురత్నం, కొమ్మతోటి సుధాకర్, బొందలపాటి నాగేశ్వరరావులతోపాటు ఐదు మండలాల అధ్యక్షులు నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జాన్‌పాల్

విద్యుత్ వాడకంలో పొదుపు అవసరం

చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ గవర్నమెంట్ విజయలక్ష్మి

దాచేపల్లి : విద్యుత్ వాడకంలో పొదుపు తప్పనిసరిగా పాటించాలని చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ గవర్నమెంట్ (సీఈఐజీ) విజయలక్ష్మి తెలిపారు. గామాలపాడు పరిధిలోని సాగర్ సిమెంట్ ఫ్యాక్టరీలో జాతీయ విద్యుత్ భద్రత వారోత్సవాలు గురువారం జరిగాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఈఐజీ విజయలక్ష్మి విద్యుత్ వాడకంపై కార్మికులకు అవగాహన కల్పించారు. ఇష్టానుసారంగా వాడటం వల్ల సమస్యలు ఉత్పన్నమవుతాయని, విద్యుత్ వాడకంలో అధికారులు సూచనలు, సలహాలు తప్పనిసరిగా పాటించాలని ఆమె సూచించారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా భద్రతా చర్యలు తీసుకోవాలని చెప్పారు. తెగిపడిన విద్యుత్ తీగలు, ఇళ్లలో జాయింట్లు ఉన్న తీగలను పట్టుకొని ప్రమాదాల బారిన పడవద్దని తెలిపారు. వర్షాకాలంలో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నందున రక్షణ చర్యలు తీసుకోవాలని ఆమె కార్మికులకు సూచించారు. అనంతరం మండలంలోని శ్రీనగర్ గ్రామంలో రైతులు, గ్రామస్తులతో ఆమె సమావేశమయ్యారు. పొలాల్లో వ్యవసాయ బోర్లు, ఇళ్లలో విద్యుత్తు వాడకంపై అవగాహన కల్పించారు. గ్రామస్తుల సందేహాలకు సమాధానం చెప్పారు. కార్యక్రమంలో సాగర్ సిమెంట్ ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ సీహెచ్.సుబ్బారావు, ఈఐ వై. ప్రసాద్, డెప్యూటీ ఈఐ ఎండీ.హుస్సేన్, అధికారులు గణేశ్, ఫణి, రామకృష్ణ, శంకర్‌నారాయణరెడ్డి, నవీన్‌రెడ్డి, నాగేశ్వరరావు, వీర ప్రకాష్, నాగభూషణం, నరసింహులు, భరత్ భూషణ్, అంబేద్కర్‌రెడ్డి, గణేశ్, పరమేశ్, లక్ష్మీరెడ్డి, మనోజ్ కుమార్, మహేందర్, కొండారెడ్డి సదాశివరెడ్డి, హేమంత్, తారక్ పాల్గొన్నారు.



పరాశక్తి సిమెంట్ ఫ్యాక్టరీ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, కార్మికులు



సమావేశంలో మాట్లాడుతున్న విజయలక్ష్మి

భద్రత ప్రమాణాలను పాటించాలి

సత్రశాల(రెంటచింతల): కర్మాగారాలలో విధులు నిర్వహిస్తున్న సమయంలో ప్రతి కార్మికుడు విద్యుత్ భద్రత ప్రమాణాలను పాటించి సురక్షితంగా ఉండాలని పరాశక్తి సిమెంట్ ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ ఎం.ఎస్.ఎన్. రాజు తెలిపారు. జాతీయ విద్యుత్ భద్రత దినోత్సవం సందర్భంగా గురువారం పరాశక్తి సిమెంట్ ఫ్యాక్టరీ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్ర విద్యుత్ అధికార సంస్థ, జాతీయ రక్షణ పాలక సంస్థ మార్గదర్శకాల ప్రకారం ఈ ఏడాది స్మార్ట్ ఎనర్జీ–సురక్షిత దేశం థీమ్‌తో ముందుకు సాగాలని తెలిపారు. స్మార్ట్, గ్రీన్ ఎనర్జీ పరిష్కారాలు వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో విద్యుత్ భద్రతా ప్రమాణాలను మరింత బలపరిచే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ థీమ్‌ను తీసుకువచ్చినట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఈ ఏడాది బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్, సిస్టమ్‌లు, ఎలక్ట్రిక్ వాహన చార్జింగ్ మౌలిక సదుపాయాలు, రూఫ్ టాప్ సోలార్ ఇన్‌స్టాలేషన్‌లపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి చర్యలు చేపట్టారని వివరించారు. కార్యక్రమంలో ఎలక్ట్రికల్ విభాగం అధికారి ఏ. వెంకటరావు, అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

నేడు వెల్దుర్తి మండల సర్వసభ్య సమావేశం

వెల్దుర్తి: స్థానిక మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం కార్యాలయంలో ఉదయం 11గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ డి. ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని ప్రభుత్వ శాఖల పనితీరుతో పాటు ఉపాధి హామీ పనులపై సమీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. మండలంలోని జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన కోరారు.

కోడిగుడ్లతో వెళ్తున్న లారీ బోల్తా

చిలకలూరిపేట టౌన్: డ్రైవర్‌కు నిద్రమత్తు ఆవహించడంతో ఒంగోలు నుంచి గుంటూరు వైపు కోడిగుడ్ల లోడుతో వెళ్తున్న మినీ లారీ బొప్పూడి పరిధిలో జాతీయ రహదారిపై అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు కాగా, మినీ లారీ పూర్తిగా ధ్వంసమైంది. కోడిగుడ్లన్నీ రోడ్డుపై చెల్లాచెదురుగా పడి పగిలిపోయాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను నియంత్రించారు. సమాచారం అందుకున్న 108 వాహన సిబ్బంది గాయాలైన డ్రైవర్‌ను చిలకలూరిపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రమాద సమయంలో డ్రైవర్ నిద్ర మత్తులో ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

